క్లుప్తంగా

సెల్‌ఫోన్లకు దూరంగా ఉండండి



వేసవి విజ్ఞాన శిబిరంలో ఉత్సాహంగా పాల్గొన్న బాలలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యార్థులు చిన్న వయసులో కేవలం చదువుపైనే దృష్టి పెట్టాలని, సెల్ ఫోన్లకు దూరంగా ఉండాలని బాల వికాసం ట్రైనర్ రామదుగు విజయకుమార్ సూచించారు. ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో భాగంగా 32వ రోజు గురువారం కార్యక్రమంలో విజయకుమార్ మాట్లాడారు. విద్యార్థులకు మెమరీ పవర్ గేమ్స్ గురించి, సెల్ ఫోన్లు వల్ల జరిగే లాభాలు, నష్టాలను వివరించారు. గంటల తరబడి ఫోన్ వాడితే నేత్రాలు దెబ్బతింటాయని, కళ్ల జోళ్లు వేసుకొనే పరిస్థితి ఏర్పడుతుందని చెప్పారు. విద్యార్థులకు పుస్తక విభాగంలో వీటీ సందీప్ కుమార్ నీతి కథలపై పోటీలు నిర్వహించారు. డి.శ్రీవల్లీ విద్యార్థులకు పేపర్ క్రాఫ్ట్స్‌లో రోలింగ్ పేపర్ డిజైన్, యోగాసానాలలో శిక్షణ ఇచ్చారు. శిక్షణ తరగతులను జిల్లా గ్రంధాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు పర్యవేక్షించగా డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్మన్‌కు ఏఐఏవైఎస్ అభినందన



ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు దంపతులను అభినందిస్తున్న ఏఐఏవైఎస్ నాయకులు

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ అధ్యక్షురాలిగా ప్రమాణ స్వీకారం చేసిన ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు దంపతులను ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి, దెందులూరు మండలం ముప్పవరం గ్రామ సర్పంచ్ డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ అభినందించారు. ఘంటా దంపతులకు డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ బీసీ మహిళకు ఇంతటి గొప్ప పదవిని కట్టబెట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఎన్నికైన రెండె మహిళ ఘంటా పద్మశ్రీ అని కొనియాడారు. కార్యక్రమంలో ఏఐఏవైఎస్ నాయకులు గారపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

ఎంపీ కోటగిరి శ్రీధర్



వైష్ణవ సేవా సంఘ భవనం శంకుస్థాపనకు హాజరైన ఎంపీ శ్రీధర్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సమాజ శాంతికి పాటుపడే బ్రాహ్మణులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా ఉంటుందని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. గురువారం నగరంలోని మాదేపల్లి ఫేజ్–2 ఇందిరమ్మ కాలనీలో ది హేలాపురి వైష్ణవ సేవా సంఘ భవన నిర్మాణానికి నిర్వహించిన శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బ్రాహ్మణ సామాజికవర్గం అంటే ప్రత్యేక అభిమానం ఉందని చెప్పారు. బ్రాహ్మణుల్లోని పేదలకు కూడా వర్తించేలా సంక్షేమ పథకాలను అమలు చేయడం ఆయన చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ఏలూరు నియోజకవర్గ పరిధిలో బ్రాహ్మణులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. తొలుత ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని వైష్ణవ సేవా సంఘ భవనం నిర్మాణానికి కేటాయించిన 200 గజాల స్థలంలో భవన నిర్మాణానికి సంఘ ప్రతినిధులు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఏలూరు నగర బ్రాహ్మణ ఐక్య కార్యాచరణ సమితి అధ్యక్షుడు టీఆర్ శర్మ, అఖిల భారత బ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షుడు ఎంబీఎస్ శర్మ, ఆర్ష సేవా సమితి అధ్యక్షుడు బీవీ సుబ్రహ్మణ్యం, ఆర్‌ఆర్‌పేట వేంకటేశ్వర స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్, వేదపాఠశాల ఉపాధ్యక్షుడు సీతంరాజు చక్రధర్, ఎంవీఆర్‌ఎస్ శర్మ, వైష్ణవ సేవా సంఘం అధ్యక్షుడు కె.కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యంతోనే బంగారు భవిష్యత్తు



సెయింట్ గ్జేవియర్ ఇండస్ట్రీస్ అధినేత బ్రదర్ ఎన్రిక్‌తో ఐటీఐ విద్యార్థులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మనం చేసే పనిపై సునిశిత దృష్టి కేంద్రీకరించి, ఆ పనిలో నైపుణ్యం సాధిస్తే బంగారు భవిష్యత్తు మన సొంతమౌతుందని సెయింట్ గ్జేవియర్ ఇండస్ట్రీస్ అధినేత బ్రదర్ ఎన్రిక్ మర్గిక్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఉపాధి, శిక్షణ శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు జీ20 ప్రెసిడెన్సీలో భాగంగా ఈ నెల1 నుంచి నిర్వహిస్తోన్న జన్ భాగీదారి కార్యక్రమాల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో విద్యార్థులను ఇండస్ట్రీస్ ఎక్స్‌పోజర్ విజిట్‌కు తీసుకెళ్లారు. విద్యార్థులు నగరంలోని సెయింట్ గ్జేవియర్ ఇండస్ట్రీస్, సూర్య ఎలక్ట్రికల్ అండ్ వైండింగ్ వర్క్స్ ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా బ్రదర్ ఎన్రిక్ మాట్లాడుతూ విద్యార్థులు బంగారు భవిష్యత్‌ను ఏర్పరుచుకుంటే దేశ అభివృద్ధికి బాటలు వేసినవారౌతారని అన్నారు. సూర్య ఎలక్ట్రికల్స్ అధినేత జి.సూర్యశేఖర రెడ్డి విద్యార్థులకు ట్రాన్స్‌ఫార్మర్లు, కెపాసిటర్లు గురించి, వాటి ఉపయోగాల గురించి వివరించారు. కార్యక్రమాలను ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ ప్రధానాధికారి పి.రజిత పర్యవేక్షించారు.

తాగునీటి సమస్యపై ఫిర్యాదు

ఏలూరు రూరల్: కొక్కిరాయిలంక ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను తక్షణం పరిష్కరించాలని ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. గురువారం కొక్కిరాయిలంక గ్రామస్తులు ఎంపీపీని కలుసుకుని తాగునీరు సరఫరా కావడం లేదని ఫిర్యాదు చేశారు. రెండు రోజులకు ఒకసారి సరఫరా చేయడం వల్ల ఇబ్బందులు పడుతున్నారని, మరోపక్క గుడివాకలంక శివారున పైప్‌లైన్ నుంచి నీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. దీనిపై స్పందించిన ఎంపీపీ వెంటనే ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్‌తో ఫోన్‌లో మట్లాడారు. తక్షణం చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గోదావరి కాలువ నీటి విడుదల చేసినందున రిజర్వాయర్‌ను పూర్తిస్థాయిలో నింపాలన్నారు.

నైపుణ్యంతో కూడిన విద్యను అందించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యార్థులకు నైపుణ్యంతో కూడిన విద్యను అందించాలని ఏలూరు జిల్లా అకడమిక్ మోనిటరింగ్ అధికారి ఏవీఎస్‌ఎన్ బాస్కర్ కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. జిల్లాలోని దూబచర్ల ఉపాధ్యాయ శిక్షణ కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పునాది దశలోనే విద్యార్థులకు భాషా నైపుణ్యం, సంఖ్యా శాస్త్ర నైపుణ్యాలను బోధించాలన్నారు. నూతన విద్యా విధానాన్ని అవగాహన చేసుకుని, భవిష్యత్ తరాలను తీర్చిదిద్దాలని కోరారు. ఉపాధ్యాయుల చేత నిపుణ్ భారత్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జవహర్ నవోదయ ప్రిన్సిపాల్ వైఎస్‌ఎస్ చంద్రశేఖర్, డైట్ ప్రిన్స్‌పాల్ పీపీ రమణ మూర్తి, రిసోర్స్‌పర్సన్లు, డైట్ సిబ్బంది పాల్గొన్నారు.

గొలుసుల పంజా మరమ్మతులు ప్రారంభం



గొలుసుల పంజా వద్ద ప్రత్యేక ఫాతెహాఖానీ నిర్వహిస్తున్న అహలే సున్నతుల్ జమాత్ ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక మెయిన్ బజారులో ఉన్న వందల సంవత్సరాల చరిత్ర గల హజరత్ మౌలా అలి ముషికిల్ కుష ఆస్థాన (గొలుసుల పంజా) ప్రహరీ, ఇతర నిర్మాణాలు శిథిల దశకు చేరుకోవడంతో అమలే సున్నతుల్ జమాత్ సంస్థ ఆధ్వర్యంలో మరమ్మతులు ప్రారంభించారు. తొలుత గొలుసుల పంజా ఎదురుగా ఉన్న ప్రహరీని తొలగించి నూతన గోడ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గురువారం ఉదయం గొలుసుల పంజా వద్ద ప్రత్యేక ఫాతెహా ఖానీ నిర్వహించారు. చరిత్రక విశేషం గల పురాతన కట్టడాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని అమలేసున్నతుల్ జమాత్ సంస్థ ప్రతినిధులు అన్నారు. ఒక ప్రాంత చరిత్ర సంస్కృతిలకు పురాతన కట్టడాలు ప్రత్యక్ష సాక్ష్యాలుగా నిలుస్తాయని చెప్పారు. అటువంటి కట్టడాలను పరిరక్షించడానికి తమ సంస్థ పూర్తిగా సహకరిస్తుందన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ఎస్‌కే సాబిర్ హుస్సేన్, ఉప కార్యదర్శి ఎండా గాలబ్ అలీ, ఉప కార్యదర్శి ఆరిఫ్, ప్రచార కార్యదర్శి ఎండీ ఎక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల ద్రోహి మోదీ ప్రభుత్వం



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

ఏలూరు (టూటౌన్) : రైతులు కష్టపడి పండించిన పంటలకు ఉత్పత్తి ఖర్చులు కంటే తక్కువగా మద్దతు ధరలు ప్రకటించి మోదీ ప్రభుత్వం ద్రోహం చేసిందని ఏపీ రైతు సంఘం ఏలూరు జిల్లా కమిటీ తీవ్రంగా విమర్శించింది. స్థానిక పవరుపేటలోని అన్నే భవన్‌లో కేంద్రం పంటలకు ప్రకటించిన మద్దతు ధరలపై ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ నర్సింహ, కార్యదర్శి కె.శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావులు గురువారం మాట్లాడారు. వరికి క్వింటాల్‌కు సి2+50 శాతం ఫార్ములా ప్రకారం రూ.2,707 ప్రకటించాలన్నారు. కానీ ప్రభుత్వం మద్దతు ధర రూ.2,183 ప్రకటించిందని, దీనివల్ల రైతులకు రూ.524 నష్టమని వివరించారు. వేరుశెనగ క్వింటాల్‌కు రూ.7,411 ప్రకటించాల్సి ఉండగా రూ.6,377 ప్రకటించిందని తెలిపారు. దీంతో క్వింటాల్‌కు రైతులు రూ.1100 నష్టపోతున్నారన్నారు. మొక్కజొన్నకి రూ.2,569 ప్రకటించాల్సి ఉండగా రూ.2,090 ప్రకటించడంతో క్వింటాల్‌కు రూ.479 నష్టపోయారని వివరించారు. ప్రత్తికి క్వింటాల్‌కు రూ.8,095 ప్రకటించాల్సి ఉండగా ప్రభుత్వం రూ.6,620 ప్రకటించడంతో రైతులు రూ.1,475 నష్ట పోయారన్నారు. 2022–23 ధర నిర్ణయంలో నీటిపారుదల ఖర్చులు, ఎరువుల ధరలు ఇతర పెరుగుదలను పరిగణలోకి తీసుకోలేదని ఆరోపించారు. పెరిగిన ఉత్పత్తి ఖర్చులకు అనుగుణంగా మద్దతు ధరలు పెంచి రైతాంగాన్ని ఆదుకోవాలని వారు కోరారు. మద్దతు ధరల గ్యారెంటీ చట్టాన్ని తీసుకురావాల్సిందిగా డిమాండ్ చేశారు.

లిడ్ క్యాప్ ఎండీని సస్పెండ్ చేయాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న చర్మకారుల సంఘం నాయకులు

ఏలూరు (టూటౌన్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (లిడ్ క్యాప్)ని పరిరక్షించాలని, సంస్థలో అవినీతి, అధికార దుర్వినియోగానికి పాల్పడుతోన్న ఎండీ డోలా శంకర్‌ను సస్పెండ్ చేసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని, హైకోర్టు సిట్టింగ్ జడ్జి చేత సమగ్ర విచారణ చేయించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జగ్జీవన్‌రామ్ చర్మకారుల కార్మిక సంక్షేమ సంఘం కోరింది. ఈ మేరకు స్థానిక పాతబస్టాండ్ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట సంఘం ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం నిరసన వ్యక్తం చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ మాట్లాడుతూ లిడ్ క్యాప్‌ను పరిరక్షించాలన్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎండీని సస్పెండ్ చేసి విచారణ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జగ్జీవన్‌రామ్ చర్మకారుల సంక్షేమ సంఘం ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాకర్లమూడి వెంకట్రావు, ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి లక్కపాము చంటి, పింగుల ఇధియా, విస్సన్నపల్లి సురేష్, గడ్డం సుందరరావు, కిలాడి రవి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారానికి భారీ ర్యాలీగా...



పెదపాడు నుంచి ర్యాలీగా వెళ్తున్న జెడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు

పెదపాడు : జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు ప్రమాణ స్వీకారానికి సత్యవోలు గ్రామం నుంచి నాయుడుగూడెం, పెదపాడు మీదుగా ఏలూరుకు భారీ ర్యాలీగా బయలు దేరి వెళ్లారు. ఈ ర్యాలీలో అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తొలుత సత్యవోలులోని విఘ్నేశ్వర స్వామి, శ్రీసీతారాముల ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అభిమానులు పెద్ద సంఖ్యలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. పెదపాడులో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, పద్మశ్రీప్రసాదరావు దివగంత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవి మన నియోజవర్గానికి చెందిన వ్యక్తికి రావడం ఎంతో సంతోషదాయకమన్నారు. ప్రజలకు ఉత్తమ సేవలు అందించి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలన్నారు. పద్మశ్రీ ప్రసాదరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనకు అప్పగించిన ఈ బాధ్యతకు శక్తి వంచన లేకుండా న్యాయం చేస్తానని చెప్పారు. అనంతరం నాయకులంతా కలిసి ఏలూరుకు ర్యాలీగా వెళ్లారు. పెద్ద ఎత్తున బాణా సంచాకాల్చడంతో పండుగ వాతావరణ నెలకొంది. కార్యక్రమంలో నర్సాపురం నియోజకవర్గ పరిశీలకుడు ఘంటా ప్రసాదరావు, దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, జెడ్పీటీసీ నిట్టా లీలా నవకాంతం, ఎంపీపీ బత్తుల రత్నకుమారి ఏసురాజు, పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్, సచివాలయాల మండల కన్వీనర్ అక్కినేని గోపీ చంద్ర దుర్గాప్రసాద్, నాయకులు ఎం కొండలరావు, కత్తుల రవికుమార్, గొట్టాపు నర్సింహరావు, జానంపేట బాబు, మేడికొండ కృష్ణారావు, దెందులూరు మండల కన్వీనర్ కామిరెడ్డి నాని, ముదుగురు సూర్యనారాయణ, కొత్తూరు సర్పంచ్ కడిమి పద్మావతి గోవిందరావు, కలపర్రు సర్పంచ్ వట్రపు విష్ణుతులసి కోటిరెడ్డి, పాతముప్పర్రు సర్పంచ్ మెడబలిమి స్వరూపరాణి సంతోషకుమార్, ఘంటసాల మోషే, మాజీ సర్పంచ్ దాసరి కనక సింహాచలం, సీనియర్ నాయకుడు గారపాటి భాస్కరరావు, కోట గోవర్ధన్, కొత్తూరు విమలారావు, సాధం కిశోర్, గుణుపూరు మహేష్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	30	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	36	చిక్కుడు కాయలు	84
వంకాయలు (కాంతులు)	40	చామదుంపలు	46
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	10
బెండకాయలు	26	కంద	40
పచ్చిమిర్చి	50-56	బీట్‌రూట్	36
కాకర కాయలు	44	కీరా దోస	46
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	--
బీరకాయలు (పందిరి)	46	అల్లం	232
క్యాబేజీ	24	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	34	పాలకూర	10
దొండకాయలు	30	చుక్కకూర	10
బంగాళదుంపలు	22	తోటకూర	10
ఉల్లిపాయలు	20	గోంగూర	07
గోరుచిక్కుడు	42	పుదీనా	05
దోసకాయలు	12	బఠాణి	--
ఆనబకాయ (1)	15	క్యాప్సికమ్	88
పొట్లకాయ(1)	15	చిలకడదుంప	26

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	09
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	07
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	11
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	11

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	10
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	06
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	02
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	07
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	11
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	18
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	35
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	36
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు -తిరుపతి	16.00	4830	36

వలంటీర్లు.. సేవా వారధులు



గుండుగొలనులో వలంటీర్లను సత్కరిస్తున్న దృశ్యం

భీమడోలు : ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన పేదలకు అందించంలో కీలక పాత్ర పోషిస్తున్న వలంటీర్లు సేవా వారధులని భీమడోలు ఎంపీపీ కనమాల రామయ్య అన్నారు. గుండుగొలనులో గురువారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లకు ప్రశంసాపత్రాలను అందించి దుశ్శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ కూర్మా లక్ష్మీ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపీపీ కనమాల రామయ్య, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి చిలువూరి సత్యనారాయణరాజు, ఉపసర్పంచ్ ముదుండి సూర్యనారాయణరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానస పుత్రిక సచివాలయ వ్యవస్థ అని, వాటిలో సేవాని రతితో సేవలందిస్తున్న వలంటీర్ల సేవలు ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ డోకల వాసంతి, వైస్ మండల సాగు సలహా సంఘం అధ్యక్షుడు పసుపులేటి సత్యనారాయణ, ఎంపీడీవో సీహెచ్ పద్మావతి దేవి, ఎంపీటీసీలు నాగన బోయిన వెంకటేశ్వరమ్మ, నత్తా నాగిని, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ జహీర్, వార్డు సభ్యుడు గొటికల మురళీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా

ఏలూరు (టూటౌన్): ఏలూరు జూట్ మిల్లు యాజమాన్యం మొండి వైఖరిని వ్యతిరేకిస్తూ.. కార్మికులకు న్యాయమైన పరిహారం చెల్లించాలని కోరుతూ శుక్రవారం ఉదయం 10 గంటలకు ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేయనున్నట్టు ఐఎఫ్‌టీయూ అనుబంధ జూట్ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 6న జేసీఎల్ ఆఫీసులో ఏలూరు జూట్ మిల్లు విషయమై జరిగిన చర్చలలో యాజమాన్యం మొండిగా వ్యవహరించిందన్నారు. ధర్నాలో కార్మికులంతా పాల్గొనాలని వెంకట్రావు విజ్ఞప్తి చేశారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

ద్వారకాతిరుమల : పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని తిమ్మాపురం ఎస్సీ కాలనీలో జలజీవన్ మిషన్ నిధులు రూ.44.37 లక్షలతో 60 వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంక్ నిర్మాణానికి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే పలువురు లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలారి మాట్లాడుతూ గోపాలపురం నియోజకవర్గానికి జలజీవన్ మిషన్ నిధులు రూ.39 కోట్లు మంజూరైనట్టు తెలిపారు. అందులో ద్వారకాతిరుమల మండలానికి రూ.10.60 కోట్లు వెచ్చించామని, త్వరలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతామన్నారు. ఇప్పటికే నల్లజర్ల మండలంలో రూ.5 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినట్టు చెప్పారు. జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ మంచినీటి కుళాయి ఇస్తామన్నారు. వేసవిలో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా అవసరమైన ప్రతి చోట మంచినీటి బోర్లను నిర్మించామన్నారు. అలాగే అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలను పంపిణీ చేశామని, సెకండ్ ఫేజ్‌లో ఇళ్లను నిర్మిస్తున్నట్టు తెలిపారు. పేదల సొంతింటి కలను నెరవేర్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. మహిళల సంక్షేమానికి, వారి అభ్యున్నతికి జగన్ నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. అందులో భాగంగా ఇప్పటివరకు నియోజకవర్గంలో రూ. 2 వేల కోట్ల సంక్షేమ ఫలాలను మహిళలకు అందించామన్నారు. అదేవిధంగా రూ. 5 వందల కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్టు చెప్పడానికి గర్విస్తున్నామన్నారు. జగనన్న ఇచ్చిన మాటకు కట్టుబడి అన్ని హామీలను నెరవేరుస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, నల్లజర్ల మండల పార్టీ కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, స్థానిక సర్పంచ్ యర్రగొల్ల రజని, ఆచంట రాకేష్ (బన్ను), బోళ్ల శ్రీనివాసరావు, పోలిన నారాయణరావు, నల్లంటి రామారావు, ఆకుర్తి శ్రీను, అప్పసాని ధర్మారావు, చవల రాంబాబు, ఘంటా శేఖర్, పిట్టా వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

దెందులూరు : నియోజకవర్గంలో జగనన్న ఇళ్ల నిర్మాణం వేగవంతం కావాలని నిర్దిష్ట సమయానికి లక్ష్యాలు సాధించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. గురువారం శ్రీరామవరంలో వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షులు, గ్రామ సర్పంచ్ కామిరెడ్డి నాని ఆధ్వర్యంలో జగనన్న ఇళ్ల కాలనీలను ఆయన పరిశీలించారు. రోడ్లు, విద్యుత్ స్తంభాలు, కుళాయిల వంటి మౌలిక వసతుల కల్పనలో అన్ని శాఖల అధికారుల సహకారం ఎలా ఉందని ప్రశ్నించారు. సంతృప్తిగా ఉందని లబ్ధిదారులు సమాధానమిచ్చారు. మెటీరియల్ సరఫరాలో ఎటువంటి ఇబ్బంది ఉండకూడదని, అలాగే లబ్ధిదారులు కూడా ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలన్నారు. తొలుత జగనన్న కాలనీకి విచ్చేసిన ఎమ్మెల్యేకు పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు అక్కినేని శ్రీనివాసరావు, కొత్తపల్లి రాఘవులు, కొత్తపల్లి బాబి, వార్డు మెంబర్లు, వలంటీర్లు, స్వాగతం పలికారు.

నీతి కథలతో నైతిక విలువలపై అవగాహన

దెందులూరు : నీతి కథలతో చిన్నారుల్లో నైతిక విలువలపై అవగాహన పెంపొందించవచ్చని గ్రంథాలయాధికారి డి.జాన్‌బాబు అన్నారు. గురువారం పోతునూరు గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా విద్యార్థులచే రిసోర్స్ పర్సన్లు నీతికథలను చదివించారు. జాతీయ నాయకులు, స్వాతంత్ర్య సమరయోధుల గురించి తెలియజేశారు. కంప్యూటర్ బేసిక్స్‌పై అవగాహన కల్పించారు.